RNI No.: TELTEL/2023/90269

# తెలంగాణ షాన్

ప్రతి పదం ప్రజల పక్షం

తెలుగు దిన పత్రిక

# TELANGANA SHAAN

Telugu Daily

Malkajgiri | Volume: 3 | Issue: 259 | Friday, January 30, 2026 | Editor: RAMANCHARLA SRIKANTH | Pages: 4 | Rs. 4/-

మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 259 | శుక్రవారం, జనవరి 30, 2026 | ఎడిటర్: రామన్‌చర్ల శ్రీకాంత్ | పేజీలు : 4 | వెల : రూ.4 /-

విలేకరులు కావలెను

తెలంగాణ షాన్

తెలుగు దినపత్రిక

నందు రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు
నియోజకవర్గ ఇన్చార్జ్‌లు
మండలాల వారిగా విలేకరులు కావలెను

ఆసక్తి గల యువతీ యువకులు

సంప్రదించవలసిన మొబైల్
నెంబర్: 99637 08331

## ముగిసిన అజిత్ పవార్ అంత్యక్రియలు



**ముంబయి:** విమాన ప్రమాదంలో మృతి చెందిన మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ అంత్యక్రియలు ముగిశాయి. గురువారం మధ్యాహ్నం విద్యా ప్రతిష్ఠాన్ మైదానంలో ప్రభుత్వ లాంఛనాలతో అజిత్ పవార్‌కు అంతిమ సంస్కారాలు చేశారు. ఈ అంత్యక్రియల్లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, మహారాష్ట్ర సిఎం దేవేంద్ర కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల మంత్రులు, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. అజిత్ పవార్‌ను కడసారి చూసేందుకు ఎన్‌సిపి కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున మైదానం చేరుకున్నారు. జిల్లా పరిషత్ ఎన్నికల ప్రచారానికి వెళ్తుండగా బారామతి విమానాశ్రయం సమీపంలో విమానం కూలడంతో అజిత్ పవార్‌తో మరో నలుగురు మృతి చెందిన విషయం తెలిసిందే.

## కెసిఆర్‌పై గౌరవం ఉంది.. సిట్ విచారణకు సహకరించాలి: పిసిసి చీఫ్



**హైదరాబాద్:** ఫోన్ ట్యాపింగ్ అత్యంత హేయమని టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. గత పదేళ్లలో విచ్చలవిడిగా ఫోన్ ట్యాపింగ్ చేశారన్నారు. కెసిఆర్ సిట్ విచారణకు సహకరించాలని పిసిసి అధ్యక్షుడు సూచించారు. గాంధీభవన్‌లో పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ విలేకరులతో మాట్లాడుతూ.. అప్పటి ప్రభుత్వంలోని పెద్దల ప్రమేయం లేకుండా అధికారులు ట్యాపింగ్ చేయలేరని ఆయన ఆరోపించారు. ఉద్యమకారుడిగా కెసిఆర్‌పై గౌరవం ఉందన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో నిజానిజాలు తేలాలని మహేశ్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు.

500లకు పైగా ఫోన్ నంబర్లు ట్యాప్ అయ్యాయన్న సమాచారం తమ దగ్గర ఉందన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరు కావాలని నోటీసులు ఇచ్చేందుకు సిట్ అధికారులు నందినగర్‌లోని కెసిఆర్ ఇంటికి వెళ్లారని, ఆ సమయంలో కెసిఆర్ ఫాంహౌస్‌లో ఉన్నారని, దీంతో నందినగర్‌లోని కెసిఆర్ నివాసంలో నోటీసులు ఇచ్చి సిట్ అధికారులు వెళ్లిపోయారని పిసిసి అధ్యక్షుడు తెలిపారు. సిట్ సంపూర్ణ విచారణ జరిపితేనే నిజాలు బయటకు వస్తాయని, ఈ విషయంలో వాస్తవాలు బయటకు రావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. కెసిఆర్‌కు నోటీసులు ఇవ్వడంపై రాజకీయ దురుద్దేశం లేదన్నారు. మున్సిపా లిటీలో మెజారిటీ స్థానాలను గెలుస్తామన్నారు. మున్సిపాలిటీల కోసం డైవర్షన్ పాలిటిక్స్ చెయ్యాల్సిన అవసరం లేదన్నారు. ఇంచార్జ్ మంత్రులు మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థులకు బిఫాం ఇచ్చే విషయంలో వారికి పూర్తి స్వేచ్ఛ ఉందన్నారు.

## హార్వర్డ్ బిజినెస్ స్కూల్లో సిఎం రేవంత్‌రెడ్డి సందడి



**హైదరాబాద్:** హార్వర్డ్ బిజినెస్ స్కూల్లో సిఎం రేవంత్‌రెడ్డి సందడి చేశారు. తన పర్యటనలో భాగంగా సిఎం పలు కీలక సమావేశాలు, అంతర్జాతీయ సంస్థలతో చర్చలు, విద్యార్థులతో ముఖాముఖీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముఖ్యంగా ప్రముఖ హార్వర్డ్ బిజినెస్ స్కూల్లో భారతీయ విద్యార్థులతో జరిగిన భేటీ కార్యక్రమం అనేక వర్గాల్లో చర్చకు దారితీసింది. భారతీయ విద్యార్థుల ప్రత్యేక ఆహ్వానంతో క్యాంపస్‌ను సిఎం రేవంత్ సందర్శించారు. ఈ మేరకు విద్యార్థులతో తన ఆలోచనలను సిఎం రేవంత్‌రెడ్డి పంచుకున్నారు. విద్యార్థులతో జరిగిన చర్చాగోష్ఠిలో సిఎం రేవంత్ తన రాజకీయ ప్రస్థానాన్ని, ఎదుర్కొన్న సవాళ్లను విద్యార్థులకు వివరించారు. విజయం అనేది అదృష్టం వల్ల రాదని నిరంతర కృషి, లక్ష్యం పట్ల స్పష్టత ఉంటేనే సాధ్యమని ఆయన విద్యార్థులకు తెలిపారు. ఎవరికైనా వారి కెరీయర్‌లో ప్రారంభంలో ఎదురయ్యే ఒడిదుడుకులను ఎలా అధిగమించాలో విద్యార్థులకు సిఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. విజన్ తెలంగాణను గ్లోబల్ మ్యాప్‌లో అగ్రస్థానంలో నిలబెట్టడమే తన ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

హైదరాబాద్‌ను కేవలం ఐటీ హబ్‌గానే కాకుండా అన్నిరంగాల్లోనూ మేటిగా తీర్చిదిద్దుతున్నామని సిఎం రేవంత్‌రెడ్డి వివరించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్ట్ గురించి సిఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. తెలంగాణ అభివృద్ధిలో అంతర్జాతీయ ప్రమాణాలను ఎలా పాటిస్తున్నామో ఆయన చెప్పారు. హార్వర్డ్ వంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో చదువుతున్న విద్యార్థులు, అంతర్జాతీయ వేదికలపై హైదరాబాద్, తెలంగాణకు బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరించాలని సిఎం వారికి పిలుపునిచ్చారు. తెలంగాణలో ఉన్న అద్భుతమైన అవకాశాల గురించి ప్రపంచానికి చాటి చెప్పాలని సిఎం అన్నారు.

### ఫోన్ ట్యాపింగ్ కేసులో.. కెసిఆర్ కు సిట్ నోటీసులు

**హైదరాబాద్:** ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ సిఎం కెసిఆర్ కు సిట్ అధికారులు నోటీసులు ఇవ్వనున్నారు. కెసిఆర్ కు నోటీసులు ఇచ్చేందుకు ఎర్రవల్లికి బయలు దేరారు. సాయంత్రంలోగా నోటీసులు ఇవ్వడంతో పాటు రేపు ఫాంహౌస్ లోనే కెసిఆర్ ను ప్రశ్నించే అవకాశం ఉంది. ఇప్పటికే బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు, సంతోష్ రావును సిట్ ప్రశ్నించింది. సాయంత్రం లోగా కెసిఆర్ కు నోటీసులు ఇవ్వాలని సిట్ నిర్ణయించింది. కెసిఆర్ కు ఇంటి దగ్గర లేదా ఫాం హౌస్ లో నోటీసులు ఇవ్వడంపై చర్చ జరగబోతోంది.

## ప్రపంచానికి భారత్ ఆశా కిరణం: మోడీ



**ఢిల్లీ:** భారత పార్లమెంట్ లో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ప్రసంగం ప్రజల ఆత్మవిశ్వాసాన్నిప్రతిబింబించిందని..ఇది చరిత్రలో అరుదైన గౌరవం అని ప్రధాని నరేంద్రమోడీ కొనియాడారు. పార్లమెంటు సభ్యులకు మార్గనిదేశం చేస్తూ కొన్ని విషయాలు చెప్పారని అన్నారు. బడ్జెట్ సమావేశాలు చాలా కీలకమైనవని, ఈ సందర్భంగా దేశ ప్రజలు, యువత ఆకాంక్షలు ప్రతిబింబించేలా ఢిల్లీలో ఆయన ప్రసంగించారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 9వ సారి బడ్జెట్ ప్రవేశ పెట్టబోతున్నారని, 2047 వికసిత్ భారత్ లక్ష్యంతో బడ్జెట్ ప్రవేశ పెట్టబోతున్నామని తెలియజేశారు. రిఫార్మ్, పెర్ఫామ్, ట్రాన్స్ ఫార్మ్ విధానంతో ముందుకెళ్లాలని, భారత్–ఇయూ వాణిజ్య ఒప్పందం భారత భవిష్యత్ కు కీలకం కానుందని మోడీ జోష్యం చెప్పారు. ప్రపంచానికి భారత్ ఆశా కిరణంగా మారిందని, భారత్–ఇయూ ఒప్పందం మదర్ ఆఫ్ ఆల్ డీల్స్ గా మారిందని అన్నారు. మన వస్తువులకు డిమాండ్ పెరగబోతుందని, తయారీ, సర్వీస్ సెక్టార్ లో మన భాగస్వామ్యం పెరుగుతుందని నరేంద్ర మోడీ పేర్కొన్నారు.

## తెలంగాణ సమాజమంతా కెసిఆర్ వెంటే ఉంది : హరీష్ రావు



**హైదరాబాద్:** సింగరేణి కుంభకోణం నుంచి దృష్టి మళ్లించేందుకు సిట్ నోటీసులు పంపించారని బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. మాజీ సిఎం కెసిఆర్ ను రాజకీయ కక్షతో వేధిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం టివి సీరియళ్లను మించి పోయిందని, సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం సాగిస్తున్న రాజకీయ కక్షను ఖండిస్తున్నామని డిమాండ్ చేశారు. కెసిఆర్ ను టచ్ చేయడమంటే తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేయడమేనని హరీశ్ రావు సూచించారు. తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపిన మహానేత కెసిఆర్ అని కొనియాడారు. కెసిఆర్ పై బురద చల్లాలని ప్రయత్నించడం సూర్యునిపై ఉమ్మి వేయడమేనని అన్నారు. ప్రజావ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకు, రాజకీయ వేధింపులతో మున్సిపాలిటీ ఎన్నికల్లో లబ్ధి పొందే కుట్ర అని.. మండిపడ్డారు. తెలంగాణ సమాజమంతా.. కెసిఆర్ వెంటే ఉందని, రేవంత్ రెడ్డి రాజకీయ వేధింపులకు భయపడే ప్రసక్తే లేదని హరీశ్ రావు పేర్కొన్నారు.

## లిఫ్ట్ ఇచ్చి... కదులుతున్న కారులో గ్యాంగ్ రేప్



**రాంఛీ:** 25 ఏళ్ల మహిళకు కారులో లిఫ్ట్ ఇచ్చి వాహనంలో ఆమెపై ఒకరు అత్యాచారం చేశారు. ఈ సంఘటన ఉత్తరాఖండ్ రాష్ట్రం ఉద్దమ్ సింగ్ నగర్ జిల్లా రుద్రపూర్‌లోని క్యాంప్ ఏరియాలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జనవరి 25న ఓ మహిళ తన ఇంటి నుంచి పని చేసే పంత్ నగర్‌కు నడుచుకుంటూ వెళ్తోంది. రాహుల్ దాస్, పర్మాన్ అనే యువకులు మహిళకు కారులో లిఫ్ట్ ఇచ్చారు. కొంచెం దూరం తీసుకెళ్లిన తరువాత కారులోనే ఆమెపై ఇద్దరు సామూహిక అత్యాచారం చేశారు. అనంతరం ఆమెను నిర్మానుష్య ప్రదేశంలో వదిలిపెట్టి వెళ్లిపోయారు. తన కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేయడంతో పాటు కారును స్వాధీనం చేసుకున్నారు. మరో వ్యక్తి పరారీలో ఉండడంతో అతడిని కూడా అరెస్ట్ చేశారు. పది రోజుల క్రితం ఉత్తరాఖండ్ రాష్ట్రం పౌరి గర్వాల్ జిల్లాలో ఓ యూనివర్సిటీ విద్యార్థినిపై స్నేహితుడు అత్యాచారం చేసిన విషయం తెలిసిందే.

## రాష్ట్ర ప్రజలను కాంగ్రెస్, బిఆర్ఎస్ మోసగిస్తున్నాయి: రామచందర్ రావు



**హైదరాబాద్:** కాంగ్రెస్, బిఆర్ఎస్ డ్రామాలాడుతున్నాయని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు విమర్శించారు. బిఆర్ఎస్ నాటి స్కామ్ లే.. కాంగ్రెస్ హయాంలో జరగుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్ కేసులో యాక్టింగ్ తప్పితే.. యాక్షన్ లేదని, రెండేళ్ల నుంచి నోటీసులు ఇస్తున్నారు తప్పితే చర్యలు లేవు అని మండిపడ్డారు. రాష్ట్ర ప్రజలను కాంగెస్, బిఆర్ఎస్ మోసగిస్తున్నాయని, నోటీసులు ఇస్తున్నారు తప్పితే.. అరెస్టులు చేయట్లేదని రామచందర్ రావు ఎద్దేవా చేశారు.

## తిరుమల లడ్డూ విషయంలో చంద్రబాబు కుట్ర బయటపడింది: భూమన



**అమరావతి:** వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని దెబ్బతీయడానికి శ్రీమహా విష్ణువునే వాడుకున్నారని టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి విమర్శించారు. తిరుమల లడ్డూలో ఎక్కడా జంతువుల కొవ్వు లేదని సిబిఐ రిపోర్టు ఇచ్చిన సందర్భంగా భూమన మీడియాతో మాట్లాడారు. శివపాలుడే సిగ్గుపడేలా, కంసుడే చెవులు మూసుకునేలా, సమస్త రాక్షసులు నోరు వెల్లబెట్టేలా చంద్రబాబు తన మాటలు, చేష్టలతో, వంతపాడే మీడియాతో తిరుమల లడ్డూపై దుష్ప్రచారం చేయించారని దుయ్యబట్టారు. శ్రీవారి లడ్డూలో జంతు కొవ్వు కలిసిందని టిడిపి నేతలు, కార్యకర్తలు కూడా దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. ప్రపంచంలో ఏ రాజకీయ నాయకుడు ఇంత రాక్షసంగా వ్యవహరించలేదన్నారు. చంద్రబాబు ఎత్తులను సిబిఐ నిర్వీర్యం చేయడంతో అనుచరులతో కలిసి రాజకీయ దాడి చేయడానికి ప్రయత్నిస్తున్నాని ధ్వజమెత్తారు. చంద్రబాబు కుట్ర బయటపడిందని, హిందువులంతా వాస్తవాలను గమనించాలని, జగన్‌ను దెబ్బ తీసేందుకు హిందువుల మనోభావాలతో సిఎం ఆడుకున్నారని చురకలంటించారు.



### అధికారం కోసం బాబు దేనికైనా తెగిస్తారు: అంబటి రాంబాబు

**అమరావతి:** తిరుపతి లడ్డూ ప్రసాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, టిడిపి కార్యకర్తలు తప్పుడు ప్రచారం చేశారని వైసిపి నేత అంబటి రాంబాబు మండిపడ్డారు. తిరుమల లడ్డూలో ఎక్కడా జంతువుల కొవ్వు లేదని సీబీఐ రిపోర్టు ఇచ్చిన సందర్భంగా అంబటి మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు అవకాశవాది, అధికారం కోసం దేనికైనా తెగిస్తారని దుయ్యబట్టారు. తిరుపతి లడ్డూలో జంతువుల కొవ్వు కలిపారంటూ దుష్ప్రచారం చేశారని, తనపై కేసులు పెడితే ఎదుర్కొంటాం కానీ దుష్ప్రచారాన్ని మాత్రం సహించమన్నారు. 'వెంకటేశ్వర స్వామి నిన్ను క్షమిస్తాడా?.. మీ పాలనలో జరిగిన పాపాలను మాపై రుద్దుతున్నారు' అని అంబటి విమర్శించారు.


తెలంగాణ షాన్

## సంపాదకీయం

# దళిత సాహిత్యోద్యమ రథసారథి

పత్రికా పాఠకులకు సుపరిచితులు డాక్టర్ ఎండ్లూరి సుధాకర్. జీవితాంతం నిజాయితీ బాట లోనే నడిచారు. నిబద్ధతకు మారుపేరు గా నిలిచారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండే మనస్తత్వం మూర్తీభవించిన వ్యక్తిత్వం సుధాకర్ కే సొంతం. ఆచార్య ఎండ్లూరి సుధాకర్ జనవరి 21, 1959 న నిజామాబాద్ లోని పాముల బస్తిలో తన అమ్మమ్మ గారి ఇంట్లో జన్మించారు. కేంద్ర సాహిత్య అకాడమీ జ్యూరీ సభ్యులు, తెలుగు సలహా మండలి సభ్యు లు, తెలుగు అకాడమీ సభ్యు లు, ప్రసిద్ధ హిందీ, ఉర్దూ పద్యాల, లఘు చిత్రాల అనువాదకులు. హైదరాబాద్ విశ్వ విద్యా లయం తెలుగు విభాగంలో సీనియర్ ప్రొఫెసర్ గా పని చేశారు. ఆచార్య ఎండ్లూరి సుధాకర్ జనవరి 21, 1959 లో నిజామాబాద్ లోని పాముల బస్తిలో దేవయ్య, శాంతా బాయిలకు ప్రథమ సంతానంగా జన్మించారు. హైదరాబాద్ వీధి బడిలో ప్రారంభమైన చదువు విశ్వవిద్యాలయం వరకు హైదరా బాద్ లోనే సాగింది. నల్లకుంట ప్రాచ్య కళాశాలలో ఓరియంటల్ విద్య, ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఎం .ఏ . ఎం.ఫిల్, పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వ విద్యాలయం లో పిహెచ్ .డి చేసారు. ఉపాధ్యాయునిగా ఉద్యోగ జీవితం ప్రారంభించి విశ్వవిద్యా లయ ఆచార్య స్థాయికి చేరు కున్నారు. 1985 నుంచి 1990 వరకు సికింద్రాబాద్ లోని వెస్లీ బాయ్స్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్ గా ఉద్యోగం చేసారు.1990 అక్టోబరు 6 వ తేది నుంచి వివిధ పదవుల్ని నిర్వ హించారు. 2004 సం.నుంచి 2011 సం.వరకు తెలుగు విశ్వ విద్యాలయం ప్రచు రించే 'వాఙ్మయి' సాహిత్య పత్రికకి సహాయ సంపాదకుడిగా, సంపాదకుడిగా వ్యవహరించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ గా, అసోసి యేట్ ప్రొఫెసర్ గా, ప్రొఫెసర్ గా ఆధునిక శాఖాధిపతిగా, (1994 నుంచి 2012 వరకు) పదవుల్ని నిర్వహించారు. 2009, సెప్టెంబరు 5వ తేదీ నుంచి రాజమండ్రి సాహి త్య పీఠానికి ఆచార్యులుగా, డీన్ గా బాధ్యతలు నిర్వహించారు. జూలై 2002లో అమెరికా తెలుగు అసోసియేషన్‌లో జరిగిన పలు సాహిత్య సభల్లో ప్రసంగించారు. 2011, డిసెంబర్ 8,9,10 తేదీలలో మారిషస్ లో ప్రపంచ తెలుగు సదస్సులో పాల్గొన్నారు. మే 2017లో అమెరికాలోని న్యూజెర్సీ సిటీలో సిలికాన్ ఆంధ్రా ద్వారా మనబడి కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌గా పాల్గొన్నారు. తెలుగు దళిత కవిత్వంలో తనదైన ముద్ర వేసుకున్న ఎండ్లూరి...వర్తమానం, కొత్త గబ్బిలం, నా అక్షరమే నా ఆయుధం, మల్లెమొగ్గల గొడుగు, నల్లద్రాక్ష పందిరి, వర్గీకరణీయం, గోసంగి, కథానాయకుడు జాషువా, తెలి వెన్నెల, తదితర రచనలు గావించి, తెలుగు సాహితీ క్షేత్రంలో తమదైన స్థానాన్ని పదిల పరచు కొన్నారు. నేటికి ఆయనను అనుకరిస్తూ, అనుసరిస్తూ ఆయన బాటలో పయనిస్తున్న వారు ఎందరో కవులు ఉన్నారంటే ఆయన ప్రభావం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. సాటి కవుల పట్ల సహృదయతే తప్ప అసూయ ఎరగని వ్యక్తిత్వం, ఎంత ఎత్తు ఎదిగినా అతి సామాన్య జీవితం గడపడం లాంటి ప్రత్యేకతలు ఆయనకే చెందుతాయని ఆయన తో పరిచయమున్న వారు చెపుతా రు. గుర్రం జాషువా అనంతరం అంతటి విశాల హృదయం, భావుకత లాంటి బహుముఖీన ప్రజ్ఞ సుధాకర్ లోనే కనబడుతుంది అంటే అతిశయోక్తి కాదు.దళిత సాహితీ రథసారథి ఎండ్లూరి సహ దర్మచారిణి దివంగత హేమలత, రచయిత్రి సామాజిక సేవకురాలు కాగా, వారి కూతురు ఎండ్లూరి మానస కథా రచయిత్రి, ఆమె రాసిన కథా సంపుటి "మిళినీద" కు 2020 సం.పు కేంద్ర సాహిత్య యువ పురస్కారం లభించడం విశేషం. లలిత కళా పరిషత్ పురస్కారం, నల్గొండ, స్లిష్టల వెంకటల్లు దీక్షితులు స్మారక సాంస్కృతిక సాహితీ కళా సమితి , యల మంచిలి, ఫ్రీవర్స్ ఫ్రంట్, ఉదయ భారతి జాతీయ అవార్డు, భువనే శ్వర్, కవికోకిల జాషువా, తిలక్ అవార్డు, బెంగళూరు, గరిక పాటి సాహిత్య పురస్కారం కాకినాడ, సమతా రచయితల పురస్కారం అమలాపురం, రాజ మండ్రి ప్రతిభాపురస్కార్, రాజ మండ్రి, జాసిస్ అవార్డు, రాజ మండ్రి, మ్యాన్ ఆఫ్ ది ఇయర్, రాజమండ్రి, తెలుగు విశ్వ విద్యాలయం ధర్మనిధి పురస్కారం, బి.ఎస్. రాములు కథా పురస్కారం, ఎన్.జి. రంగాసెంటరీ అవార్డు, డెట్రాయిట్ తెలుగు అసో సియేషన్ సిల్వర్ జూబ్లీ అవార్డు, అమెరికా తెలుగు అసోసియేషన్ ఆటా, డల్లాస్ , సినారె పురస్కారం - కరీంనగర్ , నేదురుమల్లి జనార్ధన రెడ్డి ట్రస్ట్ ప్రకాశం, నెల్లూరు, సహృ దయ సాహితీ పురస్కారం, వరంగ ల్, కొండెపూడి శ్రీనివాసరావు కవితా పురస్కారం, గుంటూరు, ఆంధ్ర ప్రదేశ్ అధికారభాషా సంఘ పుర స్కారం, ఆంధ్రప్రదేశ్ ఉగాది విశిష్ట సాహిత్య పురస్కారం, గాడే పల్లి కుక్కుటేశ్వరరావు స్మారక పురస్కా రం, అద్దంకి, తపన ఫౌండేషన్ అవార్డు రాజమండ్రి, ప్రతిభా వంతులైన విశ్వవిద్యాలయ ఉపా ధ్యాయులకు రాష్ట్ర అవార్డు, కవి జాషువా సాహిత్య ఆం.ప్ర. ప్రభుత్వ అవార్డు, రాజహంస కృష్ణ శాస్త్రి కవితా పురస్కారం, పిఠా పురం, ఎన్టీఆర్ విజ్ఞాన్ ట్రస్ట్ ద్వారా ఎన్టీఆర్ ప్రతిభా పుర స్కారం, యువకళా వాహిని ద్వారా డాక్టర్ జి ఎన్ రెడ్డి మెమోరియల్ అవార్డు, అరుణ్ సాగర్ ట్రస్ట్ ద్వారా కవి అరుణ్ సాగర్ మెమోరియల్ అవార్డు, లెక్క లేనన్ని అందు కున్నారు. 28 జనవరి 2022 (శుక్రవారం) తెల్లవారు జామున హైదరాబాద్ లో తుది శ్వాస విడిచారు. 1985 నుంచి 1990 వరకు సికింద్రాబాద్ లోని వెస్లీ బాయ్స్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్ గా ఉద్యోగం చేసారు.63వ పుట్టిన రోజు తర్వాత వారం రోజులకే ఈ లోకాన్ని వదిలి వెళతారని ఎవరూ ఊహిస్తారు.

# బడ్జెట్ పై రియల్ ఆశలు



**ముంబై :** ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్ 2026ను ప్రవేశపెట్టడానికి సిద్ధమవుతున్న తరుణంలో, రియల్ ఎస్టేట్ రంగం మరోసారి భారీ అంచనాలు పెట్టుకుంది. పుంజుకుంటున్న ప్రీమియం హౌసింగ్ డిమాండ్, మౌలిక సదుపాయాల ఆధారిత వృద్ధి, పెరుగుతున్న నిర్మాణ వ్యయాలతో, పరిశ్రమ సమస్యలు పరిష్కరించగల, పర్మిషన్స్ వేగవంతం చేయగల, విస్తరిస్తున్న రంగానికి అనుగుణంగా చేపట్టే సంస్కరణల బడ్జెట్ కోసం రియల్ ఎస్టేట్ రంగం ఎదురు చూస్తోంది. గృహ రుణ పన్నుపై ఉపశమనం కోరుకునే గృహ కొనుగోలుదారుల నుంచి పరిశ్రమ హోదా, వేగవంతమైన అనుమతులను కోరుతున్న డెవలపర్‌ల వరకు, భారతదేశ పట్టణ వృద్ధికి సంబంధించిన తదుపరి దశను రూపొందించడానికి బడ్జెట్ 2026 ఒక కీలకమైన క్షణంగా భావిస్తున్నారు.భారతీయ రియల్ ఎస్టేట్ మార్కెట్ ఇటీవలి త్రైమాసికాల్లో గణనీయమైన వృద్ధిని ప్రదర్శించింది, దీనికి బలమైన తుది-వినియోగదారుల డిమాండ్, పెరుగుతున్న ఆకాంక్షలు, మౌలిక సదుపాయాలలో స్థిరమైన ప్రభుత్వ పెట్టుబడి కారణమయ్యాయి. అయినప్పటికీ, సవాళ్లు కొనసాగుతున్నాయి. కొనుగోలుదారులలో ఎక్కువ మందికి ఆర్థిక వెసులుబాటు ఒక అడ్డంకిగా ఉంది, అయితే డెవలపర్లు ఫైనాన్సింగ్ ఖర్చులు, నియంత్రణ జాప్యాలు, పెరుగుతున్న ఇన్‌పుట్ ధరలతో ఇబ్బంది పడుతున్నారు.పాధి కల్పన, ఉఆఖలో ఈ రంగం పాత్ర బలమైన ముద్ర వేస్తోంది. అందుకే సరైన గుర్తింపును కోరుతుందని పరిశ్రమ లీడర్లు వాదిస్తున్నారు. రియల్ ఎస్టేట్ అధికారికంగా పరిశ్రమ హోదాను మంజూరు చేయాలనే దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్ . దీన్ని నెరవేర్చాలని కోరుతున్నారు. ఇది చౌకైన వ్యవస్థీకృత నిధులను అన్‌లాక్ చేస్తుంది. నియంత్రణ పర్యవేక్షణను క్రమబద్ధీకరిస్తుంది.పట్టణ ప్రాంతాల్లో సరసమైన గృహాల విస్తరించడానికి చాలా స్కోప్ ఉంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న టైర్ 2, టైర్ 3 నగరాల్లో భూమి, నిర్మాణ ఖర్చులను ప్రస్తుత ధరల పరిమితులు ఇకపై ప్రతిబింబించవని డెవలపర్లు వాదిస్తున్నారు, ఇక్కడ గృహ డిమాండ్ పెరుగుతోంది కానీ అధికారిక ప్రయోజనాలు పరిమితంగా ఉంటాయని అంటున్నారు.ప్రీమియం, లగ్జరీ హౌసింగ్ వైపు పెరుగుతున్న డిమాండ్ బడ్జెట్ అంచనాలను రూపొందించే మరొక ధోరణి. అనేక మార్కెట్లలో మిడ్-ప్రీమియం, హై-ఎండ్ విభాగాలు సరసమైన గృహాలను అధిగమిస్తుండటంతో, డెవలపర్లు సంస్థాగత పెట్టుబడి, దీర్ఘకాలిక మూలధన ప్రవాహాలకు మద్దతు ఇచ్చే విధానాలను కోరుకుంటున్నారు.సౌకర్యవంతమైన వర్క్‌స్పేస్ విభాగంలో, 315 వర్క్ అవెన్యూ వ్యవస్థాపకుడు మానస్ మెహ్రోత్రా, కోవర్కింగ్ సేవలకు, ముఖ్యంగా స్టార్టప్‌లు, చిన్న వ్యాపారాలకు రాయితీ, స్లాబ్ ఆధారిత ఉ ాా రేట్ల కోసం పిలుపునిస్తున్నారు. ఇంటీరియర్ ఫిట్-అవుట్‌లపై బ్లాక్ చేసిన ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్‌ను తొలగించాలని, కోవర్కింగ్ చెల్లింపులపై 10 శాతం ఆా హేతుబద్ధీకరణను కూడా ఆయన కోరుకుంటున్నారు. భారతదేశ కోవర్కింగ్ పర్యావరణ వ్యవస్థను స్కేల్ చేయడానికి మెరుగైన నగదు ప్రవాహ నిర్వహణ, సంస్థాగత ఫైనాన్స్‌కు ప్రాముఖ్యత చాలా అవసరం అని అంటున్నారు. భారతదేశం రియల్ ఎస్టేట్ రంగం టైర్ 2కు విస్తరణ తదుపరి దశలోకి ప్రవేశిస్తున్నందువ గృహ డిమాండ్‌ను నిర్మాణాత్మకంగా పెంచడానికి బడ్జెట్ 2026 ఒక అవకాశం అని ఖీఇం ఇండియా అఇా ప్రవీణ్ శర్మ అన్నారు. డిజిటల్ గవర్నెన్స్ ద్వారా స్థిరమైన సరసమైన గృహ మద్దతు, మరింత ఆచరణాత్మక గృహ రుణ పన్ను ప్రయోజనాలు, వేగవంతమైన ఆమోదాల అవసరాన్ని ఆయన ఎత్తి చూపారు.గృహ డిమాండ్ మాత్రమే కాదు, రాబోయే దశాబ్దంలో భారతదేశ వృద్ధిని నిర్వచించే విస్తృత పట్టణ పరివర్తన కూడా ప్రమాదంలో ఉంది. దాదాపు 250 అనుబంధ పరిశ్రమలకు రియల్ ఎస్టేట్ ఇంధనంగా పనిచేస్తుండటంతో, మద్దతు ఇచ్చే, ఊహించదగిన, సంస్కరణ-ఆధారిత బడ్జెట్ పెట్టుబడిదారుల విశ్వాసాన్ని బలోపేతం చేయగలదని, స్థోమతను మెరుగుపరచగలదని, భారతదేశ రియల్ ఎస్టేట్ మార్కెట్‌ను మరింత ప్రపంచవ్యాప్తంగా పోటీతత్వ ప్రాతిపదికన ఉంచగలదని పరిశ్రమ నాయకులు వాదిస్తున్నారు.

# కమలానికి మున్సిపల్ పరీక్ష



**హైదరాబాద్ :** ఈసారి పురపోరు బీజేపీకి ప్రతిష్టాత్మకంగా మారనుంది. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అంతంత మాత్రంగానే సీట్లు దక్కించుకున్న బీజేపీకి ఈ ఎన్నికలు అగ్నిపరీక్ష కానున్నాయి. అధికారంలోని కాంగ్రెస్ పార్టీకి తామే ప్రత్యామ్నాయమని చెప్పుకునే కమలం పార్టీ ఇప్పు డు ఆశలన్నీ మున్సిపల్‌పైనే పెట్టుకుంది. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఎదగాలంటే ప్రతి ఎన్నికల్లోనూ బీజేపీ గెలవాల్సిన పరిస్థితి. ఈ ఫలితాలను బట్టే ప్రజల్లోకి పాజిటివ్ సంకేతాలు వెళ్తాయి.మొదటి నుంచి తమకు అర్బ న్ (పట్టణ) ప్రాంతాల్లోనే బలం ఉందని చెప్పుకుంటున్న బీజేపీ ఈ ఎన్నికల్లో అత్యధికంగా కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, వార్డులను కైవసం చేసుకోవాల్సి ఉంటుంది. ఇందులో భాగంగానే వరుసగా ఎన్నికల సన్నాహక సమావేశాలను నిర్వహిస్తూ నాయకులకు ఇన్‌చార్జ్‌లు దిశానిర్దేశం చేస్తున్నారు. ఇప్పటికే జాతీయ నాయకత్వం ముగ్గురు ఎన్నికల ఇన్‌చార్జ్‌లు, కో ఇన్‌చార్జ్‌లను నియమించగా త్వర లోనే జాతీయ అధ్యక్షుడితోపాటు పలువురు జాతీయ నాయకులకు ఏకంగా రంగంలోకి దింపబోతోందిరాష్ట్రంలో ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలు, 2,996 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్ ప్రక్రియకు రేపటితో ఆఖరు గడువు. అయితే గత మున్సిపల్ ఎన్నికల్లో 322 కౌన్సిలర్లు, కార్పొరేటర్లను బీజేపీ గెలుచుకుంది. వీటితోపాటు ఐదు మున్సిపల్ చైర్మన్లను బీజేపీ తమ ఖాతాలో వేసుకుంది. మొన్న జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 5000 మందిని బరిలోకి దింపి 800 నుంచి 1000 వరకు పంచాయతీలను గెలుచుకుంది.గ్రామీణంలో తమకు పెద్దగా బలం లేదని, పట్టణమే తమ బలమని కమలం పార్టీ ముందు నుంచి అంటోంది. ప్రజల్లోనూ బీజేపీ అంటే అర్బన్ పార్టీ అనే ముద్రనే ఉంది. ఇప్పుడిదే బీజేపీకి అగ్నిపరీక్షగా మారింది. మరోవైపు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కూడా అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంటున్నాయి. రాజకీయ పార్టీల గుర్తుల మీద ఈ ఎన్నికలు జరుగనుండటంతో పురపోరులో ఏ పార్టీ బలమెంతో స్పష్టమవుతుంది. తమకున్న పేరును నిలుపుకోవాలన్నా...వచ్చే జీహెచ్ఎంసీ, అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించాలన్నా ఈ ఎన్నికల్లో కచ్చితంగా విజయబావుటా ఎగురవేయాల్సిందే.ఇందులో భాగంగానే బీజేపీ ఈసారి పెద్ద టార్గెట్‌ను పెట్టుకుంది. మొత్తం మున్సిపాలిటీల్లో 50 నుంచి 60 శాతం వరకు గెలవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. అలాగే ఏడు కార్పొరేషన్లలో నాలుగు నుంచి ఐదు వరకు గెలుచుకునేలా వ్యూహాలను అమలు చేస్తోంది. వీటితోపాటు పార్టీ తన ఉనికిని చాటుకునేలా ఎక్కువ కార్పొరేటర్లు, కౌన్సిలర్లను గెలుచుకోవడమే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది.నూతనంగా ఎన్నికైన జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌తో వారం రోజుల క్రితం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు భేటీ అయ్యారు. ఢిల్లీ నుంచి ఆయన వచ్చిన వెంటనే అత్యవసరంగా పార్టీ పదాధికారుల మీటింగ్ నిర్వహించి నాయకులకు దిశానిర్దేశం చేశారు. జాతీయ నాయకత్వం ఇప్పటికే ముగ్గురిని రంగంలోకి దింపిందని, వారికి మున్సిల్ ఎన్నికల ఇన్‌చార్జ్‌లుగా నియమిస్తూ.. మహారాష్ట్ర మంత్రి ఆశిష్ శెలార్‌కు, కోఇన్‌చార్జ్‌లుగా రేఖా శర్మ, అశోక్‌కు బాధ్యతలను అప్పగించిందని పేర్కొన్నారువీరు ముఖ్యనాయకులతో వరుసగా ఎన్నికల సన్నాహక సమావేశాలను నిర్వహిస్తూ ఎన్నికల వ్యూహాలను రచిస్తున్నారు. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలకు ఆయా జిల్లాలు, నియోజకవర్గాలు, పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఎన్నికల టాస్క్‌లను అప్పగించారు. వీటికితోడూ ఇప్పటికే జిల్లా, మున్సిపాలిటీల వారీగా మరికొంత మంది రాష్ట్ర నేతలను ఇన్‌చార్జ్‌లుగా రాష్ట్ర నాయకత్వం నియమించింది. రాష్ట్రవ్యాప్తంగా రెండు భారీ బహిరంగ సభలను నిర్వహించాలని పార్టీ నిర్ణయించినట్లు తెలుస్తోంది.ఫిబ్రవరి 7, 9వ తేదీల్లో వీటిని నిర్వహించాలని ప్లాన్ చేసినట్లు తెలిసింది. ఈ సభలను ఉత్తర తెలంగాణ, దక్షిణ తెలంగాణలో నిర్వహించాలని నిర్ణయించారు. తొలుత ఐదు సభలను నిర్వహించాలని అనుకున్న పార్టీ నేతలు దాన్ని రెండుకు కుదించినట్లుగా తెలిసింది. ఈ సభల ద్వారా ఓటర్లను ఆకర్షించేందుకు బీజేపీ జాతీయ స్థాయి దిగ్గజాలను రంగంలోకి దించుతోంది.పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సిన్హాతో పాటు కీలక నేత అమిత్‌షా హాజరుకానున్నట్లు తెలుస్తోంది. అయితే ఎన్నికలకు చాలా తక్కువ సమయం ఉండడంతో ఎన్ని సభలు నిర్వహిస్తారో...ఎంత మంది నేతలు వస్తారనేది ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాలంటే కమలనాథులకు ఈ పురపోరు ఎన్నికలు మాత్రం పరీక్షే అని చెప్పాలి.

# రేవంత్ శాఖ నే టార్గెట్ చేసిన కోమటిరెడ్డి




**నల్గొండ :** తెలంగాణ రాజకీయాలలో సంచలనాలు అంతకంతకు చోటు చేసుకుంటున్నాయి. ఎప్పుడు ఎటువంటి పరిణామం జరుగుతుందో అర్థం కావడం లేదు. మంత్రుల నుంచి మొదలు పెడితే ప్రతిపక్ష నాయకుల వరకు ప్రతి ఒక్కరు ఏదో ఒక విధమైన కామెంట్లు చేస్తున్నారు. అవి కాస్త సోషల్ మీడియా నుంచి ప్రధాన మీడియా వరకు విపరీతంగా చర్చలో ఉంటున్నాయి.ఇటీవల కోమటిరెడ్డి వెంకటరెడ్డి పై ఓ న్యూస్ ఛానల్ కథనాన్ని ప్రసారం చేసింది. ఈ కథనం తెలంగాణ రాజకీయాలనే కాదు ఏకంగా ఏపీ రాజకీయాలను కూడా ప్రభావితం చేసింది. ఈ వ్యవహారంలోకి కొంతమంది మీడియా ప్రతినిధులు ప్రవేశించడంతో మరింత వివాదంగా మారింది. దీనిపై ఏకంగా ముఖ్యమంత్రి స్పందించడం.. ఉప ముఖ్యమంత్రి కలగజేసుకోవడం.. ఆ తర్వాత బొగ్గు టెండర్లను రద్దు చేయడం వంటి పరిణామాలు జరిగాయిఈ పరిణామాల కంటే ముందు కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పందించారు. విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కీలక వ్యాఖ్యలు చేశారు. తన మీద కక్ష తీరకపోతే.. ఇంత విషం పెట్టి చంపాలని ఆవేదనతో మాట్లాడారు. ఆయన మాట్లాడిన మాటలు ఒకరకంగా తెలంగాణ రాజకీయాలలో సంచలనం సృష్టించాయి. ఇప్పుడు వాటిని మర్చిపోకముందే కోమటిరెడ్డి వెంకటరెడ్డి మరోసారి తనదైన శైలిలో వ్యాఖ్యలు చేశారు.కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రస్తుతం తెలంగాణ క్యాబినెట్లో కీలకమైన మంత్రిగా కొనసాగుతున్నారు. ఈ క్రమంలో ఆయన తెలంగాణ విద్యా వ్యవస్థకు సంబంధించి కీలక వ్యాఖ్యలు చేశారు. " నేనే విద్యాశాఖ మంత్రిని అయితే కార్పొరేట్ పాఠశాలలను మూసి వేస్తాను. నారాయణ కాలేజీలో డిగ్రీ చేసిన వారు ఉంటే ప్రభుత్వ కాలేజీలలో పీహెచ్డీ చేసిన వారు ఉంటారు. ఏ ఉద్యోగం రాకుండా లక్షల ఉద్యోగం చేస్తున్నారు. బట్టి పట్టిస్తే వందల మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకోవాలి. విద్య అనేది వ్యాపారం కాదు. విద్యను వ్యాపారంగా మార్చడం సరికాదని" కోమటిరెడ్డి అన్నారు. మంగళవారం నల్గొండలో జరిగిన ఓ సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.తెలంగాణ రాష్ట్రంలో విద్యాశాఖను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. రేవంత్ రెడ్డి పర్యవేక్షిస్తున్న శాఖను ఉద్దేశించి కోమటిరెడ్డి ఆ వ్యాఖ్యలు చేయడంతో సహజంగానే రాజకీయంగా చర్చకు దారి తీస్తోంది. కోమటిరెడ్డి మాట్లాడిన మాటలను గులాబీ మీడియా విపరీతమైన నెగిటివ్ ప్రచారం చేస్తోంది.. అయితే తాను చేసిన వ్యాఖ్యలను వేరే కోణంలో చూడవద్దని ఇప్పటికే కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పడం గమనార్హం.

# మేడారంలో భగ్గుంటున్న ధరలు



**వరంగల్ :** మేడారం జాతర ప్రారంభమైంది. వనదేవతల దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. అయితే, జాతర నేపథ్యంలో కొబ్బరికాయల నుంచి కోళ్లు, మేకల ధరలు, ఇళ్ల అద్దెల వరకు అన్నీ ఆకాశాన్నంటుతున్నాయి. స్థానికులు ఇళ్లలో కనీస వసతులు లేకున్నా అధిక మొత్తంలో అద్దెలు వసూలు చేస్తూ భక్తులను దోచుకుంటున్నారు. చెట్టు నీడకు కూడా కిరాయి వసూలు చేయడం గమనార్హం. ఈ మూడు రోజులు ధరలు మరింత పెరుగుతాయంటున్నారు. పెరిగిన ధరలతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు.తెలంగాణ కుంభమేళా మేడారం జాతర ప్రారంభమైంది. నేటి నుంచి నాలుగు రోజుల పాటు జరగనున్న వనదేవతల జాతరకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక, పక్క రాష్ట్రాల నుంచి కూడా భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. తెలంగాణ జాతరకు వెళ్లే భక్తుల కోసం టీజీఆర్టీసీ 4 వేల బస్సులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది.దిలా ఉంటే జాతర నేపథ్యంలో మేడారం పరిసర ప్రాంతాల్లో ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. కొబ్బరికాయ మొదలు అమ్మలకు సమర్పించే బంగారం (బెల్లం), కోళ్లు, మేకల ధరలతో పాటు, ఇళ్లు, ప్రత్యేక గదుల అద్దెలను భారీగా పెంచి భక్తులను దోచుకుంటున్నారు. ఆఖరికి చెట్టు నీడకు కూడా కిరాయి వసూలు చేస్తున్నారంటే జాతరలో దోపిడీ ఏ స్థాయిలో జరుగుతుందో ఊహించవచ్చు.మేడారం జాతరలో భాగంగా భక్తులు మొక్కులు చెల్లించుకోవడానికి బంగారం (బెల్లం)తో పాటు కోళ్లు, మేకలను సమర్పిస్తారు. ఇదే అదునుగా మేడారం జాతర వద్ద కోళ్లు, మేకల ధరలను భారీగా పెంచారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు వెంట తీసుకురాలేక, జాతరకు వచ్చాక అక్కడే కొనుగోలు చేస్తుంటారు. ఈ క్రమంలో వ్యాపారులు ధరలను రెట్టింపు చేశారు.మేకపోతు లైవ్ కిలో రూ. 420 ఉండగా, మేడారంలో మాత్రం రూ. 900 నుంచి రూ. 1000 వరకు అమ్ముతున్నారు. మటన్ ధర రూ. 1500 వరకు పలుకుతోంది. బయట రూ. 170-180 కి దొరికే కిలో కోడిని జాతర దగ్గర రూ. 300-350 వరకు అమ్ముతున్నారు. మొన్నటి వరకు కూడా కిలో రూ. 350-400 ఉన్న నాటుకోడిని ఇప్పుడు రూ. 700లకు అమ్ముతున్నారు. జాతర చివరి మూడు రోజుల్లో ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది.ఇళ్ల అద్దెలు కూడా భక్తులకు చుక్కలు చూపిస్తున్నాయి. కనీస వసతి సౌకర్యాలు లేకపోయినా సరే అద్దెలు ఆకాశాన్నంటాయి. ఆఖరికి చెట్ల నీడలో సేదతీరడానికి కూడా అద్దెలు వసూలు చేస్తున్నారు. పిల్లలు, వృద్ధులతో వచ్చిన భక్తులు ఉండటానికి ఇళ్లు వెతుకుతుండటంతో స్థానికులు భారీ మొత్తంలో అద్దెలు వసూలు చేస్తున్నారు. ఒక్క ఫ్యాన్ తప్ప మరే ఇతర సౌకర్యాలు లేని గదులకు కూడా రోజుకు రూ. 6 వేల వరకు వసూలు చేస్తున్నారు.గదులు దొరకని వారు చెట్ల నీడలో సేదతీరడానికి ప్రయత్నిస్తుండగా, తోట యజమానులు వాటికి కూడా అద్దెలు వసూలు చేస్తున్నారు. జాతరకు దగ్గరలో తోటలున్న స్థానికులు భక్తులకు చెట్లను అద్దెకు ఇస్తున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేయడానికి ఒక్కో చెట్టుకు రూ. 1000 చొప్పున వసూలు చేస్తున్నారు.

# గ్యాంగ్‌స్టర్ నయీం కేసులో ఈడీ ఛార్జిషీట్



**హైదరాబాద్ :** గ్యాంగ్‌స్టర్ నయీం అక్రమాస్తుల కేసులో ఈడీ దూకుడు పెంచింది. రూ. 11.30 కోట్ల విలువైన 35 ఆస్తులు.. నయీం అక్రమంగా సంపాదించినట్లు ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఆ ఆస్తులను అతడి కుటుంబ సభ్యులు, సన్నిహితులు ఇతర బినామీల పేర్లపై రిజిస్టర్ చేసినట్లు గుర్తించారు. అంతేకాకుండా నయీం అక్రమాస్తుల విషయంలో పోలీసు, రాజకీయ సంబంధాలపై కూడా ఈడీ ఆరా తీస్తోంది. 2016లో జరిగిన ఎదురుకాల్పుల్లో నయీం హతం అయ్యాడు. గ్యాంగ్‌స్టర్ నయీం 2016లో జరిగిన ఎదురుకాల్పుల్లో మృతి చెందిన విషయం తెలిసిందే. అతడికి సంబంధించిన అక్రమాస్తుల కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వేగం పెంచింది. నయీంపై జరిగిన మనీలాండరింగ్ ఆరోపణలపై ఈడీ దర్యాప్తు జరిపింది. తాజాగా నాంపల్లి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈడీ దాఖలు చేసిన ఛార్జిషీట్‌ను పరిశీలించిన కోర్టు విచారణకు అంగీకరించింది. కాగా, గ్యాంగ్‌స్టర్ నయీం.. తన గ్యాంగ్ సభ్యులతో కలిసి దాదాపు రూ. 11. 30 కోట్ల విలువైన 35 ఆస్తులను అక్రమంగా సంపాదించినట్లు ఈడీ ఛార్జిషీటులో పేర్కొంది.కాగా, నయీంకు సంబంధించిన అక్రమాస్తులపై ఈడీ 10 మందిపై అభియోగాలు మోపింది. ఛార్జిషీట్ ప్రకారం.. నయీం యాదాద్రి భువనగిరి జిల్లాలోని షాపింగ్ కాంప్లెక్స్‌లు, వ్యవసాయ భూములు కూడా ఉన్నాయి. ఈ ఆస్తులన్నీ నయీం తన కుటుంబ సభ్యులు, సన్నిహితులు ఇతర బినామీల పేర్లపై రిజిస్టర్ చేసినట్లుగా ఈడీ అధికారులు గుర్తించారు. కాగా, నయీం అక్రమాస్తుల కేసులో అతడి భార్య హసీనా బేగంతో పాటు పలువురు కుటుంబ సభ్యుల పేర్లను ఈడీ తన ఛార్జిషీట్‌లో పేర్కొంది. అయితే ఈడీ ఆరోపిస్తున్న అక్రమాస్తులకు సంబంధిచి కొన్నిసార్లు నోటీసులు జారీ చేసినా.. స్పందించకపోవడం, ఐటీఆర్ పత్రాలు చూపించకపోవడంతో కేంద్ర దర్యాప్తు సంస్థ చర్యలు తీసుకునేందుకు సిద్ధమైంది.మరోవైపు, నయీంకు ఉన్న పోలీసులు, పొలిటికల్ సంబంధాలపై కూడా ఈడీ కూపీ లాగుతున్నట్లు తెలుస్తోంది. అక్రమంగా సంపాదించిన సొమ్ము ఎక్కడికి వెళ్లింది.. ఇందులో అధికారులు, రాజకీయ నాయకుల హస్తం ఏమైనా ఉందా అనే కోణంలో ఈడీ దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. కాగా, ఈ కేసులో త్వరలో నిందితులకు కోర్టు నోటీసులు జారీ చేయనున్నట్లు తెలుస్తోంది.తెలుగు రాష్ట్రాల్లో అండర్ వరల్డ్ డాన్‌గా పేరున్న నయీం 2016 ఆగస్టు 8న ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. భూ సెటిల్‌మెంట్లు, చేస్తూ తనకంటూ ఓ గ్యాంగ్ ను మెయింటెన్ చేస్తూ ప్రభుత్వాలను ముచ్చెమటలు పట్టించాడు. దీంతో ఇతడి అక్రమాలపై తెలంగాణ ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలో నందిగామ గ్రామంలోని మిలీనియం టౌన్ షిప్ లోని ఓ వ్యక్తి ఇంట్లో ఉంటూ స్థానిక భూదందాలు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. అనంతరం వారున్న స్థలానికి వెళ్లగా.. పోలీసులకు నయీం అనుచరులు కాల్పులు జరిపారు. ఆ తర్వాత పోలీసులు జరిపిన ఎదురు కాల్పుల్లో నయీం మృతి చెందాడు.ఐపీఎస్ వ్యాస్, మావోయిస్టు సాంబశివుడి వంటి వారి హత్య కేసులో నయీం ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. కాగా, నయీం మృతితో బాధితులంతా బయటకు వచ్చి ఫిర్యాదులు చేశారు. దీంతో బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ కేసు విచారణకు సిట్ ఏర్పాటు చేసింది. నయీంపై దాదాపు 250 కేసులు నమోదు చేయగా మనీ లాండరింగ్ ఆరోపణలపై ఈడీ రంగంలో దిగి దర్యాప్తు చేపట్టింది.

# 'సింహం' గుర్తుపై జాగృతి అభ్యర్థుల పోటీ

**హైదరాబాద్ :** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ జాగృతి, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కలిసి పోటీ చేయనున్నాయి. జాగృతి అభ్యర్థులు ఫార్వర్డ్ బ్లాక్ 'సింహం' గుర్తుపై పోటీ చేయనున్నారు. ఇక తొలిరోజు 902 నామినేషన్లు దాఖలు కాగా.. ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనున్న సంగతి తెలిసిందే.తెలంగాణ మున్సిపల్ ఎన్నికల నగారా మోగడంతో రాష్ట్ర రాజకీయాలు హీటెక్కాయి. ప్రధాన పార్టీలతో పాటు చిన్న పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత మద్దతుదారులు ఎన్నికల బరిలో నిలిచేందుకు సిద్ధమయ్యారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీతో కలిసి పోటీ చేసేందుకు రెడీ అయ్యారు. ఈ మేరకు జాగృతి అధ్యక్షురాలు కవిత, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర నాయకత్వం మధ్య జరిగిన కీలక చర్చలు ఫలించాయి. రానున్న పురపాలక ఎన్నికల్లో తెలంగాణ జాగృతికి చెందిన ఔత్సాహిక అభ్యర్థులు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి చెందిన 'సింహం' గుర్తుపై పోటీ చేయాలని నిర్ణయించారు. కేవలం ఈ ఎన్నికలకే పరిమితం కాకుండా.. భవిష్యత్తులో కూడా ప్రజా సమస్యలపై ఉమ్మడిగా పోరాడాలని ఇరు పక్షాలు అంగీకారానికి వచ్చాయి. హైదరాబాద్‌లోని ఫార్వర్డ్ బ్లాక్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశం, కొత్త రాజకీయ సమీకరణాలకు నాంది పలికింది.ఇక బుధవారం నామినేషన్ల స్వీకరణ మొదటి రోజే అభ్యర్థులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మొత్తం 2,996 వార్డులకు గాను తొలిరోజే 902 నామినేషన్లు దాఖలయ్యాయి. 890 మంది అభ్యర్థులు పోటీలో నిలవగా.. కొందరు అభ్యర్థులు రెండేసి సెట్ల నామపత్రాలను సమర్పించారు. క్షేత్రస్థాయిలో తమ పట్టు నిరూపించుకునేందుకు అభ్యర్థులు ఉత్సాహం చూపుతున్నారు. మొదటి రోజు నామినేషన్ల పర్వంలో కాంగ్రెస్ పార్టీ అత్యధికంగా 382 నామినేషన్లతో అగ్రస్థానంలో నిలిచింది. బీఆర్ఎస్ 258 నామినేషన్లతో రెండవ స్థానంలో ఉండగా, బీజేపీ నుంచి 169 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.నామినేషన్ల స్వీకరణకు శుక్రవారమే ఆఖరి గడువు కావడంతో.. నేడు, రేపు అభ్యర్థుల తాకిడి భారీగా పెరిగే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఎన్నికల అధికారులు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అదనపు సిబ్బందితో ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. కాగా.. ఫిబ్రవరి 11న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ జరగనున్నాయి.తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు ఏర్పడే అవకాశం ఉంది.ఈ పరిణామం ముఖ్యమైంది ఎందుకంటే తెలంగాణ జాగృతి సాధారణంగా సాంస్కృతిక, సామాజిక సంస్థగా పిలుస్తున్నా, ఇప్పుడు నేరుగా ఎన్నికల బరిలోకి దిగడం ద్వారా తన రాజకీయ బలాన్ని ప్రదర్శించాలని చూస్తోంది. ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి చెందిన "సింహం" చిహ్నం ఇప్పటికే రాష్ట్ర ప్రజలకు పరిచయమైందని, జాగృతి కార్మికుల చేరిక దాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఉపయోగపడుతుందని కవిత భావిస్తున్నారు. ఈ ఒప్పందం తెలంగాణ స్థానిక రాజకీయాల్లో కొత్త ఎత్తుగడకు కారణమవుతుందని అంటున్నారు. ఈ మధ్య కవిత, ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్‌తో సమావేశమయ్యారు. రాజకీయ పార్టీ ఏర్పాటు, విధి విధాలు, ప్రచార వ్యూహాలపై లోతుగా చర్చించారు. ఆ పనులు ఒకవైపు సాగుతుండగానే మరోవైపు మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసి అసలైన బలాన్ని అంచనా వేసుకోవాలని కవిత భావిస్తున్నారు. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నారు.

# ఐపీఈలో 'సంస్కృతి--2కె26' కోలాహలం: జాతీయ స్థాయి మేనేజ్‌మెంట్ ఉత్సవం ప్రారంభం

## -దేశవ్యాప్త విద్యార్థుల ఉత్సాహ నినాదాలతో హోరెత్తిన శామీర్‌పేట క్యాంపస్..
## - రెండు రోజుల పాటు మేనేజ్‌మెంట్ సవాళ్లు








**మేడ్చల్ జిల్లా, తెలంగాణ షాన్, జనవరి 29:**
శామీర్‌పేటలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ (IPE) క్యాంపస్ గురువారం దేశవ్యాప్త మేనేజ్‌మెంట్ విద్యార్థుల సందడితో కళకళలాడింది. ఐపీఈ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ స్థాయి విద్యార్థి ఉత్సవం 'సంస్కృతి--2కె26' అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ వేడుకను బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రాంతీయ ప్రధాన అధికారి బి. సనిల్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు.
?ప్రారంభోత్సవ సభలో సనిల్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని సూచించారు. "కృషి, ఆసక్తి, సహానుభూతి, మరియు పట్టుదల అనే విలువలు ఉంటేనే వృత్తి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు" అని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులే స్వయంగా ముందుండి ఇంతటి భారీ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు.ఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్. శ్రీనివాస మూర్తి మాట్లాడుతూ, 'సంస్కృతి' ఉత్సవం విద్యార్థుల్లో దాగి ఉన్న నాయకత్వ లక్షణాలను, మేనేజ్‌మెంట్ నైపుణ్యాలను వెలికితీసే ఒక గొప్ప వేదిక అని తెలిపారు. డీన్ (అకాడమిక్స్) ప్రొఫెసర్ వి. శ్రీకాంత్ మాట్లాడుతూ, విద్యార్థులు ఆరోగ్యకరమైన పోటీ తత్వంతో ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు.
?ఉత్సాహంగా సాగుతున్న పోటీలు దేశవ్యాప్తంగా వివిధ బి-స్కూల్స్ నుండి సుమారు 1500 మంది విద్యార్థులు ఈ ఉత్సవానికి హాజరయ్యారు. శాస్త్ర, అగ్రగామి, నివేశ్, శబ్దసాగర్, కురుక్షేత్ర, రణభూమి, ఇక్షిత్, తరంగ్, హైప్ వంటి పేర్లతో వినూత్నమైన పోటీలను నిర్వహిస్తున్నారు. తొలిరోజున ప్రధానంగా మేధోమథనానికి సంబంధించిన మేనేజ్‌మెంట్ క్విజ్, బిజినెస్ ప్లాన్ వంటి పోటీలు జరిగాయి.రెండో రోజు: శుక్రవారం జరగబోయే ముగింపు వేడుకల్లో భాగంగా సంగీతం, నృత్యం, మరియు ఫ్యాషన్ షో వంటి సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.?ఈ కార్యక్రమానికి (NMDC) ప్రధాన ప్రాయోజకుడిగా వ్యవహరిస్తుండగా.. బ్యాంక్ ఆఫ్ బరోడా, ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, నూటీ లా ఆఫీస్ వంటి సంస్థలు సహకారాన్ని అందిస్తున్నాయి. కార్యక్రమంలో ఐపీఈ డీన్ లక్ష్మీకుమారి, సమన్వయకర్త డాక్టర్ రాజ్‌కుమార్ పిల్లై తదితరులు పాల్గొన్నారు.

# యూటర్న్‌లో దానం



**హైదరాబాద్ :** తెలంగాణలో పార్టీ ఫిరాయింపుల ఎమ్మెల్యేలలో ఏడుగురికి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ క్లీన్ చిట్ ఇచ్చారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి విషయం తేల్చాల్సి ఉంది. ఫిరాయింపులపై ఇదే లాస్ట్ ఛాన్స్ అని సుప్రీం కోర్టు ఇప్పటికే డెడ్‌లైన్ విధించింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఈ ముగ్గురి లెక్క తేల్చే పనిలో పడ్డారు స్పీకర్.ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు స్పీకర్ ఈసారి కఠినమైన నోటీసుల జారీ చేశారు. ఏది ఏమైనా ఈనెల 30లోగా విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. పార్టీ ఫిరాయింపులపై వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. లేదంటే పార్టీ ఫిరాయించినట్లుగానే పరిగణించాల్సి ఉంటుందని పరోక్షంగా చెప్పారు. తాజా నోటీసులు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి.స్పీకర్ తీర్మానం ప్రకారం, దానం నాగేందర్‌ను ఈ నెల 30 తేదీన విచారణకు కట్టుబడి హాజరు కావాలి. లేదంటే ఇది సభా నియమాల ఉల్లంఘనలకు సంబంధించిన చర్యగా కనిపిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకే దానం నాగేందర్‌కు నోటీసులు పంపినట్లు సమాచారం. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పైచేయి సాధించింది. మున్సిపల్ ఎన్నికల్లోనూ సాధిస్తామన్న ధీమాతో ఉంది. ఆ నమ్మకంతోనే దానంతో రాజీనామా చేయించే ఆలోచనలో కాంగ్రెస్ అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల తరహాలో దానంతో కాంగ్రెస్ టికెట్‌పై మళ్లీ పోటీ చేయించాలన్న ఆలోచన ఉన్నట్లు సమాచాం.ఇక దానం విచారణకు వస్తే అడ్డంగా దొరికిపోతారు. ఎందుకంటే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన దానం.. లోక్‌సభ ఎన్నికల్లో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేకుండానే కాంగ్రెస్ టికెట్‌పై సికింద్రాబాద్ ఎమ్మెల్యేగా పోటీ చేశారు. ఒక పార్టీ ఎమ్మెల్యేగా ఉంటూ మరో పార్టీ టికెట్‌పై పోటీ చేదయడం పార్టీ ఫిరాయింపు కిందకే వస్తుంది. దీంతో విచారణలో తాను బీఆర్ఎస్‌లో ఉన్నానని చెప్పి తప్పించుకునే అవకాశం లేదు.సుప్రీం కోర్టు డెడ్‌లైన్ నేపథ్యంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, కాంగ్రెస్ అధిష్టానం అన్నింటికి సిద్ధపడ్డట్లు తెలుస్తోంది. ఒకవైపు కాంగ్రెస్ కండువా కప్పుకుని, ఆ పార్టీ తరపున ఎంపీగా పోటీ చేసినప్పటికీ, సాంకేతికంగా తాను పార్టీని వీడలేదని వాదించడం ద్వారా అనర్హత వేటు పడకుండా చట్టపరమైన లొసుగులను వెతుక్కున్నట్లుగా కనిపిస్తోంది. దానం నాగేందర్ తన వివరణలో వినిపించిన అత్యంత కీలకమైన వాదన ఆయన వ్యక్తిగత హోదా . 2024 మార్చిలో తాను కాంగ్రెస్ పార్టీ సమావేశానికి హాజరైన మాట వాస్తవమేనని అంగీకరిస్తూనే, అది కేవలం వ్యక్తిగత హోదాలో మాత్రమేనని, దానిని పార్టీ మార్పిడిగా పరిగణించలేమని ఆయన సమర్థించుకున్నారు. మీడియా కథనాల ఆధారంగా తాను పార్టీ మారినట్లు బీఆర్ఎస్ భావించడం సరికాదని, చట్టపరంగా తాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేగానే కొనసాగుతున్నానని ఆయన వాదిస్తున్నారు. పార్టీ తనను సస్పెండ్ చేసినట్లు కూడా ఎలాంటి సమాచారం లేదని చెప్పడం ద్వారా, బంతిని మళ్ళీ బీఆర్ఎస్, స్పీకర్ కోర్టులోకి నెట్టారు. అయితే దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న దృశ్యాలు, కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ నుండి లోక్‌సభకు పోటీ చేసిన రికార్డులు కళ్లముందే ఉన్నాయని బీఆర్ఎస్ నేతలంటున్నారు. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం స్వచ్ఛందంగా పార్టీ సభ్యత్వాన్ని వదులుకోవడం అనే నిబంధన దానంకు స్పష్టంగా వర్తిస్తుందని, ఎంపీగా కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేయడమే దానికి అతిపెద్ద నిదర్శనమని బీఆర్ఎస్ వాదిస్తోంది. ఈ పరిస్థితుల్లో దానం చేసిన వ్యక్తిగత హోదా వాదన కేవలం కాలయాపన చేసేందుకు ఆడుతున్న నాటకమని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. మొదట దానంపై అనర్హత వేటు వేయకుండానే రాజీనామా చేయించే ఆలోచనలో ఉంది. స్పీకర్ నోటీసుల నేపథ్యంలో దానం రేపో మాపో రాజీనామా చేసే అవకాశం ఉంది. దీంతో మరో ఆరు నెలల్లో ఖైరతాబాద్‌కు ఉప ఎన్నికలు రానున్నాయి. ఉప ఎన్నికలకు కాంగ్రెస్ అధిష్టానం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

# ఆనంద్‌బాగ్‌లో అష్టముఖ గండభేరుండ నరసింహునిగా సాలగ్రామ నారాయణుడు



**మల్కాజిగిరి: తెలంగాణ షాన్, జనవరి 29:**
ఆనంద్‌బాగ్ భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆనంద్‌బాగ్‌లోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర ఆలయంలో సాలగ్రామ నారాయణుడు 'అష్టముఖ గండభేరుండ నరసింహస్వామి' అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ అరుదైన అవతార విశిష్టతను ఆలయ ప్రధాన అర్చకులు ముడుంబై వెంకట రమణా చార్యులు వివరించారు. హిరణ్యకశిపుని సంహారం అనంతరం నరసింహస్వామి ఉగ్రత్వాన్ని తగ్గించేందుకు, శరభుడిని ఓడించేందుకు విష్ణువు ధరించిన అత్యంత శక్తివంతమైన రూపమే ఈ గండభేరుండ అవతారమని తెలిపారు. ఈ రూపంలో స్వామివారు హయగ్రీవ, వ్యాఘ్ర, సింహ, గండభేరుండ, భల్లుక, గరుడ, ఆంజనేయ, వరాహ అనే ఎనిమిది ముఖాలతో, 32 చేతులతో కొలువై ఉంటారని.. ఈ స్వామిని ఆరాధించడం వల్ల శత్రు బాధలు తొలగి, రోగ నివారణ కలుగుతుందని పురాణాల ద్వారా తెలుస్తోందన్నారు. ఆలయ ఈఓ ఏబి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో భారీగా భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు తులసి వెంకట రమణ చార్యులు, క్లర్క్ సంద్ర సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రమైన గాలితోనే నిజమైన అభివృద్ధి : ఉప ముఖ్యమంత్రి భట్టి



హైదరాబాద్ : పరిశుభ్రమైన గాలితోనే నిజమైన అభివృద్ధి వుంటుంది. తెలంగాణ ప్రభుత్వం స్పష్టమైన లక్ష్యంతో శాస్త్రీయ విధానాన్ని అనుసరిస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. గురువారం జరిగిన గాలి నాణ్యత సూచీ (ఐతితీ ఖిబీజీశ్రీతిబిఎ ఎనిటవలీ) మరియు గాలి నాణ్యత నిర్వహణపై సదస్సులో అయన ప్రసంగించారు.భట్టి మాట్లాడుతూ నివాస ప్రాంతాల్లోని పరిశ్రమలతో భద్రత, ఆరోగ్య ప్రమాదాలు వుంటాయి. గాలి నాణ్యత పర్యవేక్షణకు రాష్ట్రంలో 40 కొత్త స్టేషన్లను ఏర్పాటు చేశాం. త్వరలో గాలి నాణ్యత డాష్ బోర్డులను ప్రారంభిస్తామన్నారు.రాష్ట్ర ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని కల్పించేందుకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ క్యాబినెట్ ముందుకు వెళుతుందని అన్నారు.నేడు తెలంగాణ దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలలో ఒకటి, హైదరాబాద్ ఐటీ, లైఫ్ సైన్సెస్, తయారీ, ఆవిష్కరణల కేంద్రంగా ఎదిగింది, ఈ అభివృద్ధి మనకు గర్వకారణం అని తెలిపారు.అదే సమయంలో ఇది మనపై బాధ్యతను కూడా మోపుతుంది అన్నారు.అభివృద్ధి మరియు పర్యావరణ పరిరక్షణను ఎదురెదురుగా నిలబెట్టలేం, అవి చేతులు కలిపి ముందుకు నడవాలి అని డిప్యూటీ సీఎం అన్నారు.సుస్థిర అభివృద్ధి ద్వారా మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యాన్ని సాధించాలనే దృఢ సంకల్పంతో మా ప్రభుత్వం పనిచేస్తోందనీ తెలిపారు. అదే సమయంలో జలాశయాల పునరుద్ధరణ, సహజ వనరుల సంరక్షణ, గాలి నాణ్యత మెరుగుదలపై కూడా తమ ప్రభుత్వం పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతోందనీ డిప్యూటీ సీఎం తెలిపారు.ఎందుకంటే శుభ్రమైన గాలి లేకుండా జరిగే అభివృద్ధి నిజమైన ప్రగతి కాదు, ఇది కేవలం ఆలస్యమైన నష్టం మాత్రమే అని వివరించారు. గాలి నాణ్యత ఒక పర్యావరణ సూచీ మాత్రమే కాదు, అది ప్రజారోగ్య సూచీ, అది ఉత్పాదకత సూచీ మరియు అది ఆర్థిక సూచీ కూడా అన్నారు. 2024 'స్టేట్ ఆఫ్ గ్లోబల్ ఎయిర్ రిపోర్ట్' సహా ప్రపంచ స్థాయి అధ్యయనాలు ఈ సమస్య తీవ్రతను స్పష్టంగా చూపుతున్నాయి అని తెలిపారు.హైదరాబాద్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాలలో ఒకటిగా ఇప్పటికే గుర్తింపు పొందింది, ఇది మనందరికీ గర్వకారణం,కానీ అదే సమయంలో మన నగర వ్యవస్థలు కూడా అంతే వేగంగా పరిపక్వం చెందాలి అని డిప్యూటీ సీఎం ఆకాంక్షించారు.

# మొక్కు తీర్చుకునేందుకు ఎడ్లబండ్లే...

**వరంగల్ :** మేడారం సమ్మక్క సారలమ్మ జాతర అత్యంత వైభంగా జరుగుతోంది. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వరకూ మాత్రమేకాదు, తెలుగు రాష్ట్రాలు, దూరప్రాంతాల నుంచి రోజూ లక్షలాదిగా భక్తులు మేడారం జతరకు తరలివెళుతున్నారు.మేడారం సమ్మక్కా ,సారలమ్మ జాతర దర్శించుకోవడానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని వివిధ ప్రాంతాల నుంచి కాలినడకన వచ్చేవారు. ఆ తరువాత కాలంలో ఎడ్ల బండ్లపై రావడం ఆనవాయితీగా మారింది. వ్యవసాయ ఆధారిత గ్రామాలు కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచి ఎడ్లబండ్లపై అమ్మవారి జాతరకు ఓ నాలుగు రోజుల ముందే కుటుంబ సమేతంగా బయలుదేరేవారు. ముఖ్యంగా తెలంగాణలో ప్రతీ గ్రామం నుంచి బండెనక బండి కట్టి, పదహారు బళ్లు కట్టి అన్నట్లుగా ఒక్కో ఊరు నుంచి వందల బళ్లు మేడారం జాతరకు కదిలేవి. ఈ ఏడాది కూడా ఎడ్ల బండి సెంటిమెంట్ విషయంలో ఎక్కడా తగ్గేదే లేదంటున్నారు మేడారం భక్తులు. ఏఐ యుగంలోకి ప్రవేశించినా ఎడ్ల బండ్లంటేనే అమ్మవారికి మహా ఇష్టమంటున్నారు. ఈ ఏడాది మేడారం జాతరకు తెలంగాణ ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేనంతగా అద్భుతంగా ఏర్పాట్లు చేసింది. మేడారం ప్రాంగణాన్ని వందల కోట్లతో కన్నుల పండుగగా అభివృద్ధి చేయడమేకాదు, దూర ప్రాంతాల నుండి మేడారం వెళ్లే భక్తుల కోసం వేలాదిగా ఆర్టీసి బస్సు సర్వీసులు నడపడమేకాదు, ఏకంగా తొలిసారి రెండు హెలికాప్టర్ల ను ఏర్పాటు చేసి గంటన్నరలో మేడారం దర్శనం చేసి తీసుకొచ్చేందుకు సర్వం సిద్ధం చేసింది. హనుమకొండలో మీరు అలా హెలికాప్టర్ ఎక్కితే కేవలం 35 నిమిషాల్లో మేడారం , 30నిమిషాల్లోపు మేడారం దర్శనం, మరో 35 నిమిషాల్లో తిరిగి హనుమకొండకు చేర్చేలా హెలికాప్ట్ సేవలు అందుబాటులోకి తెచ్చారు. ఒక్కో వ్యక్తికి 36వేలు టిక్కెట్ ఖర్చుతో మొత్తం మేడారం దర్శనం అనుభూతి కల్పిస్తున్నారు.కేవలం గంటన్నరలోనే దర్శనం పూర్తి చేసుకునే అవకాశంతోపాటు అందుబాటులో ఆర్టీసి బస్సులు, ప్రవేటు వాహనాలు ఇలా అనేక మార్గాల ద్వారా మేడారం చేరుకునే సదుపాయాలు ఉన్నా, నేటికీ తెలంగాణలోని అనేక గ్రామాల నుండి ఎడ్ల బండ్లపై భక్తులు భారీగా తరలిరావడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. మాకు మగ బిడ్డ పుడితే ఎడ్ల బండిపై మేడారం వస్తామని మొక్కుకున్నాం. అమ్మ అనుగ్రహించింది ,మగ బిడ్డ పుట్టాడు. అందుకే ప్రతీ ఏడాది ఎడ్ల బండిపైనే మేడారం గద్దెలను దర్శించుకుంటున్నామని జాతరకు వస్తున్న కొందరు భక్తులు చెబుతున్నారు. ఇలా కొందరు సంతానం కోసం, మరికొందరు అనుకున్నది సాధించడం కోసం.. ఇలా మొక్కులు తీరడంతో ఎడ్ల బండ్లపైనే ప్రతీ జాతరకు సుదూర ప్రాంతాల నుండి సైతం తరలివస్తున్నారు.ఒక్కో ఎడ్ల బండిపై ఒక్కో కుటుంబం ,



వారితోపాటు అమ్మవారికి మొక్కులు తీర్చుకోవడానికి మేకపోతు,నాటు కోడి, నాలుగు రోజులకు అవసరమైన మద్యం, ఎడ్లకు ఓ ఐదు రో?జులకు సరిపడా ఎండుగడ్డి, ఎడ్ల బండ్లు మధ్యలో ఆపి సేదతీరెందుకు , పొలామధ్యలో డారాలు వేసి రాత్రి సమయంలో నిద్రించేందుకు పరదాలు, వంటకు అవసరమైన రైస్, కూరగాయలు, ఉప్పు, పప్పు, కట్టెలు, ఇలా అన్నీ ఎడ్ల బండిపైన సర్దుకుని మేడారం జాతరకు కుటుంబ సమేతంగా బయలుదేరడం తరతరాలుగా లక్షలాది మంది భక్తులకు ఓ సెంటిమెంట్ గా వస్తోంది. తెల్లవారుజామున లేచి, ఆరోజుకు సరిపడా మూడుపూటల భోజనం సిద్ధం చేసుకుని ఇంటి వద్ద మొదలైన మేడారం ప్రయాణం, ప్రతీ పది లేదా పదిహేను కిలోమీటర్లకోసారి ఎడ్లను ఆపి, కాసేపు అందమైన పంటచేల మధ్యలో , ఆహ్లాదరకమైన అడవి మార్గంలో సేద తీరుతీరుతుంటారు. వాగులకు సమీపంలో భోజనం చేయడం, రాత్రి సమయంలో అక్కడే డేరాలు వేసుకుని నిద్రించడం, తిరిగి తెల్లవారుజామున మళ్లీ ప్రయాణం మొదలుపెట్టడం.. ఇలా మేడారం చేరుచుకునే మార్గమధ్యలో ఎడ్లబండి ప్రయాణం అంటే మాటల్లో చెప్పలేని సరికొత్త అనుభూతి అనడంలో ఏ మాత్రం సందేహంలేదు.అన్నదమ్ములు, ఆడపడుచులు, అక్క చెల్లెళు ల్లు, అత్త కోడళ్లు.. ఇలా అంతా తమ ఎడ్లబండ్లపై మేడారం సమీపంలో ఒకేచోటకు చేరుకుంటారు. అక్కడే ఎడ్లబండ్లకు డేరాలు కట్టి గుడారాలుగా మార్చుకుంటారు. అలా నాలుగు రోజులపాటు మేడారం పరిసర ప్రాంతాల్లో ఎన్నో కుటుంబాలు ఒక్కటై మేడారం గద్దెల వద్ద మొక్కులు తీర్చుకుంటారు. మందు ,ముక్క లేకుండా జాతర పూర్తవ్వదనే విషయం తెలిసిందే.. అలా సరదాగా గడపడం కోసం రెండేళ్ల కోసారి తెలంగాణలో రైతుల కుటుంబాలేకాదు, రైతులను నమ్ముకున్న ఎద్దులు సైతం ఎదురుస్తుంటాయట, ఓ ఏడాది జాతరకు వెళ్లిన ఎద్దులు, అదే మార్గం గుర్తుపెట్టుకుని రైతు చెప్పకుండానే మేడారం జాతర వద్దకు తీసుకెళ్లడం మరో విశేషంగా చెప్పవచ్చు.

# జనం మధ్యకు సమ్మక్క

**వరంగల్ :** ఆసియాలోనే అతిపెద్ద గిరిజన మహాజాతర మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర వైభవంగా జరుగుతోంది. కోట్లాది భక్తుల ఆరాధ్య దైవాలైన వనదేవతల కొలువుతో ములుగు జిల్లాలో ఉన్న అటవీప్రాంతం జనసంద్రమైంది. జనవరి 28 బుధవారం సాయంత్రం సారలమ్మ గద్దెపై కొలువుదీరడంతో జాతరకు అంకురార్పణ జరిగింది. భక్తుల జయజయధ్వానాలు, ఆదివాసీ వాయిద్యాల హోరు మధ్య మేడారం పులకించిపోయింది.మేడారం జాతర ప్రారంభానికి వారం ముందు నుంచే మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు.. జాతర మొదటిరోజు సారలమ్మ రాకను చూసి తరించేందుకు పిల్లాపాపలతో తరలివచ్చారు. కన్నెపల్లిలోని సారలమ్మ ఆలయంలో ఉదయం నుంచే పూజలు నిర్వహించారు... సాయంత్రం వేళ అమ్మవారి ప్రతిరూపమైన పసుపు, కుంకుమలను మొంటెలో (వెదురు బుట్ట) ఉంచి మేడారానికి తీసుకొచ్చారు. పోలం వెంకటేశ్వర్లు పట్టిన హనుమాన్ జెండా నీడన అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ క్రతువులో 'వరం పట్టడం' అనే భక్తి ప్రక్రియ ప్రత్యేక ఆకర్షణ అని చెప్పుకోవాలి. సంతాన భాగ్యం కోసం, కోరిన కోర్కెలు నెరవేరేందుకు మహిళలు ఆలయ మెట్ల నుంచి సుమారు వంద మీటర్ల మేర భూమిపై మోకరిల్లుతారు.. అమ్మవారిని మోస్తున్న పూజారులు వారిపై నుంచి నడుచుకుంటూ వెళ్లిన దృశ్యం భక్తులను పులకింపజేసింది. దారంతా కోళ్లను బలిస్తూ వనదేవతలకు స్వాగతం పలికారు. జంపన్నవాగుదాటుకుని మేడారం చేరుకుని...అప్పటికే సిద్ధంగా ఉన్న పగిడిద్దరాజు, గోవిందరాజులతో కలిసి సారలమ్మను గద్దెపైకి తీసుకొచ్చారుసమ్మక్క భర్త పగిడిద్దరాజు గంగారం మండలం పూనుగొండ్ల నుంచి పెళ్లికొడుకుగా ముస్తాబై కాలినడకన అడవి మార్గంలో మేడారానికి చేరుకున్నారు. జాతర మొదటి రోజు ఉదయానికే మేడారం చేరుకున్న పగిడిద్దరాజు...ఆలయం వద్ద సమ్మక్క రాకకోసం వేచి చూశారు. సాధారణంగా మొదటి రోజు సాయంత్రానికి సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజును ప్రతిష్టిస్తారు..కానీ ఈ ఏడాది అనుకోని కారణాలతో ఆలస్యంగా గద్దెలపైకి చేరారు. రాత్రి 12 దాటిన తర్వాత దేవాదాయ శాఖ అధికారులు విద్యుత్ దీపాలను నిలిపివేసి, అత్యంత రహస్యంగా క్రతువును పూర్తి చేశారు.జాతరలో అత్యంత ప్రధానమైన ఘట్టం సమ్మక్క అమ్మవారి ఆగమనం జనవరి 29 గురువారం జరగనుంది. సాయంత్రం 5 గంటల సమయంలో చిలకలగుట్టపై ప్రధాన పూజారి కొక్కెర కృష్ణయ్య ఆధ్వర్యంలో రహస్యంగా పూజలు నిర్వహించి కుంకుమ భరిణె రూపంలో ఉన్న సమ్మక్కను వెదురు బొంగులో భద్రపరిచి తీసుకొస్తారు. అమ్మవారు గుట్ట దిగే సమయంలో జిల్లా ఎస్పీ ఏకే 47 తుపాకీతో గాలిలోకి కాల్పులు జరిపి అధికారికంగా స్వాగతం పలుకడం, ఎదురుకోళ్ల మండపం వద్ద మేడారం ఆడబిడ్డలు అమ్మవారికి నీళ్లతో స్వాగతం పలకే దృశ్యాలు భక్తులను పూనకంలో ముంచెత్తుతాయి. గురువారం రాత్రికి సమ్మక్క కూడా గద్దెపై కొలువుతీరిన తర్వాత వనదేవతలను భారీగా భక్తులు దర్శించుకుంటారుమేడారం జాతర రద్దీని దృష్టిలో ఉంచుకుని ములుగు జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర .. గురువారం నాడు జిల్లావ్యాప్తంగా స్థానిక సెలవు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. భక్తుల రక్షణ కోసం సుమారు 13 వేల మంది పోలీసులు, 40 వేల మంది వివిధ శాఖల సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. జాతర మొదటి రోజే ఆర్టీసీ ఏర్పాటు చేసిన 50 ఎకరాల ప్రయాణ ప్రాంగణం బస్సులతో నిండిపోగా, ప్రైవేటు వాహనాల కోసం కేటాయించిన 1,462 ఎకరాల పార్కింగ్ స్థలం కూడా సరిపోలేదు. ఇక సమ్మక్క తల్లి గద్దెపైకి రాకతో ఈ రద్దీ మరింత పెరుగుతుంది

# తెలుగులో హాట్ స్పాట్ టు మచ్




తమిళంలో 2024లో విడుదలై మంచి విజయం సాధించింది 'హాట్ స్పాట్' మొదటి భాగం. తాజాగా శుక్రవారం రిలీజ్ అయిన 'హాట్ స్పాట్' రెండో భాగం కూడా ఘన విజయం సాధించింది. మొదటి మూడు రోజుల్లో 2 కోట్ల రూపాయల గ్రాస్ కలెక్ట్ చేసి చిన్న చిత్రాల్లో పెద్ద విజయంగా రికార్డ్ క్రియేట్ చేసింది. ముఖ్యంగా అర్బన్ యూత్‌ను ఆకట్టుకొని మల్టీప్లెక్స్ థియేటర్స్‌లో హౌస్ ఫుల్‌గా నడుస్తోంది.

హాట్ స్పాట్ మొదటి భాగం తెలుగులో ఆహా ఓటిటి ప్లాట్ ఫామ్‌లో స్ట్రీమింగ్ అవుతోంది.

'హాట్ స్పాట్ 2 మచ్' సినిమా తెలుగు డబ్బింగ్ వెర్షన్ ఫిబ్రవరి 13న వాలంన్స్ డే సందర్భంగా రిలీజ్ చేస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ శ్రీనివాసమూర్తి తెలిపారు. ప్రియా భవాని శంకర్, ఏం ఎస్ భాస్కర్, తంబి రామయ్య, అశ్విన్ కుమార్ నటించిన ఈ చిత్రానికి నిర్మాత అనిల్ కె రెడ్డి కాగా దర్శకుడు విఘ్నేశ్ కార్తిక్.

## పాత్రలతోనే తన స్థాయిని నిరూపించుకుంటున్న నటుడు...



నటుడు నవదీప్ పుట్టినరోజు సందర్భంగా, తెలుగు సినీ పరిశ్రమలో పాత్రాధారిత సినిమాలకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చిన ఓ విశిష్ట నటుడిని స్మరించుకునే సందర్భమిది. కథను, పాత్రను ముందుంచే ఎంపికలతో, భయంలేని నటనతో తనదైన ప్రయాణాన్ని కొనసాగిస్తూ, నిలకడైన అభిరుచిగల నటుడిగా నవదీప్ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. తన తాజా చిత్రం 'దండోరా' లో నవదీప్ చేసిన పాత్ర ఆయన కెరీర్‌లోనే అత్యుత్తమ నటనలలో ఒకటిగా ప్రశంసలు అందుకుంటోంది.

భావోద్వేగ నియంత్రణ, సహజ నటన, అంతర్గత సంఘర్షణను ఆవిష్కరించిన తీరు కథకు బలంగా నిలిచింది. ఈ పాత్ర ద్వారా నటుడు కనిపించకుండా, పాత్ర మాత్రమే ప్రేక్షకుల ముందు నిలిచేలా చేశారు. 'దండోరా'లో నవదీప్ నటనకు ప్రేక్షకులు, విమర్శకులు మంచి స్పందన వ్యక్తం చేస్తున్నారు. ఇది ఆయన పాత్రాధారిత నటనకు మరో నిదర్శనం. ఇక రాబోయే ప్రాజెక్టస్ ద్వారా నవదీప్ మరిన్ని విభిన్నమైన, శక్తివంతమైన పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు సిద్ధమవుతున్నారు. కంటెంట్ ప్రాధాన్యత కలిగిన సినిమాల్లో విశ్వసనీయ నటుడిగా ఆయన ప్రయాణం కొనసాగుతోంది.

## ఆ ఫీలింగ్ రాదు..



తరుణ్ భాస్కర్ లీడ్ రోల్‌లో నటిస్తున్న హిలేరియస్ విలేజ్ కామెడీ ఎంటర్‌నర్ 'ఓం శాంతి శాంతి శాంతిః'. ఈషా రెబ్బా హీరోయిన్‌గా నటిస్తున్నారు. సజీవ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఎస్ ఒరిజినల్స్, మూవీ వెర్స్ స్టూడియోస్ బ్యానర్స్ పై సృజన్ యరబోలు, ఆదిత్య పిట్టీ, వివేక్ కృష్ణని, అనుప్ చంద్రశేఖరన్, సాధిక్ షేక్, నవీన్ సనివరపు ఈ వెంచర్‌ను నిర్మిస్తుండగా, కిషోర్ జాలాది, బాల సౌమిత్రి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈనెల 30న వరల్డ్ వైడ్ గ్రాండ్‌గా ఈ సినిమా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈషా రెబ్బా డియాతో ముచ్చటించారు. –'ఇది రీమేక్. ఇలాంటి సినిమా నాకు రావడం చాలా ఆనందంగా అనిపించింది. ఈ సినిమా ఒరిజినల్ నాకు చాలా ఇష్టం. అందులో హీరోయిన్ క్యారెక్టర్ నాకు చాలా నచ్చింది. ఇది అందరూ యూనివర్సల్‌గా కనెక్ట్ అయ్యే స్టోరీ.

–మన తెలుగు నేటివిటికి తగ్గట్టు కథలో, పాత్రల్లో చాలా మార్పులు చేశారు. ఇందులో ఉండే ఎమోషన్స్ అందరు కూడా కనెక్ట్ అయ్యేలాగా ఉంటాయి. సినిమా చూస్తున్నప్పుడు రీమేక్ అనే ఫీలింగ్ రాదు. ఇందులో అన్ని క్యారెక్టర్స్‌కి ఆడియన్స్ రిలేట్ అవుతారు. –నాకు శాంతి క్యారెక్టర్ చేయడం చాలా ఎగ్జైటింగ్‌గా అనిపించింది. ఇలాంటి క్యారెక్టర్ చేయాలని ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నాను. కెరీర్‌లో ఒక్కసారైనా ఇలాంటి పాత్ర వస్తే చేయాలని అనుకునేదాన్ని.

–మన తెలుగు నేటివిటికి తగ్గట్టు కథలో, పాత్రల్లో చాలా మార్పులు చేశారు. ఇందులో ఉండే ఎమోషన్స్ అందరు కూడా కనెక్ట్ అయ్యేలాగా ఉంటాయి. సినిమా చూస్తున్నప్పుడు రీమేక్ అనే ఫీలింగ్ రాదు. ఇందులో అన్ని క్యారెక్టర్స్‌కి ఆడియన్స్ రిలేట్ అవుతారు. –నాకు శాంతి క్యారెక్టర్ చేయడం చాలా ఎగ్జైటింగ్‌గా అనిపించింది. ఈ సినిమాతో ఆ కోరిక తీరింది. ఈ సినిమాకి హండ్రెడ్ పెర్సెంట్ ఎఫర్ట్ పెట్టాను. –ఇది మంచి ఫ్యామిలీ ఎంటర్టైనర్ ఇందులో మెయిన్ కాన్ఫ్లిక్ట్‌ని చాలా ఫన్నీగా అలాగే ఎంటర్టైనింగ్‌గా చెప్పడం జరిగింది. ఎక్కడ కూడా మెసేజ్ ఇచ్చినట్లుగా ఉండదు. తరుణ్ భాస్కర్ గారితో వర్క్ చేయడం చాలా హ్యాపీ.

## ఐదు భాషల్లో 'త్రిముఖ'!



యోగేష్ కల్లె హీరోగా, సన్నీ లియోన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా 'త్రిముఖ'. అకృతి అగర్వాల్, అఎఆ ఆదిత్య శ్రీవాస్తవ, మొట్టా రాజేంద్రన్, ఆశు రెడ్డి, సాహితీ దాసరి, ప్రవీణ్, షకలక శంకర్, సుమన్, రవి ప్రకాష్, జీవా, సమ్మెట గాంధీ, జెమినీ సురేశ్ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని అఖిరా డ్రీమ్ క్రియేషన్స్ బ్యానర్ ద శ్రీదేవి మద్దాలి, రమేష్ మద్దాలి నిర్మిస్తున్నారు. ఈ మూవీకి రాజేష్ నాయుడు దర్శకత్వం వహిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో ఐదు భాషల్లో ఏకకాలంలో చిత్రీకరించిన ఈ పాన్ ఇండియా మూవీని ఈ నెల 30న రిలీజ్ చేయనున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన డైరెక్టర్ రాజేశ్ నాయుడు..'ఒక మంచి కథతో, బలమైన స్క్రీన్ ప్లేతో 'త్రిముఖ' చిత్రాన్ని రూపొందించాను. మూవీ ఫస్టాఫ్ అంతా ఎంటరన్ చేస్తుంది. సెకండాఫ్ తల పక్కకు తిప్పనంతగా ఎంగేజింగ్‌గా థ్రిల్లింగ్‌గా ఉంటుంది. సినిమాలోని ప్రతి క్యారెక్టర్‌కు ఇంపార్టెన్స్ ఉంటుంది. ప్రతి పాత్ర ఒక మంచి విషయాన్ని తెలియజేస్తుంది. రొటీన్ సినిమాలకు తప్పకుండా భిన్నంగా ఉండేలా ప్రయత్నించాం. యోగేష్‌కు నటుడిగా పేరు తెచ్చే మూవీ అవుతుంది' అని తెలిపాడు.

## సైన్స్ ఫిక్షన్‌తో వస్తున్న నితిన్

వైవిధ్యమైన సినిమాలు, పాత్రలతో తనదైన గుర్తింపు సంపాదించుకున్న హీరో నితిన్ తన 36 సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. వెర్సల్ డైరెక్టర్ వి.ఐ.ఆనంద్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. పవన్ కుమార్ సమర్పణలో సక్సెస్‌ఫుల్ బ్యానర్ శ్రీనివాస సిల్వర్ స్క్రీన్‌పై శ్రీనివాస చిట్టూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. రథ సప్తమి సందర్భంగా సైన్స్ ఫిక్షన్ ఎంటర్‌నర్‌ను మేకర్స్ అనౌన్స్ చేశారు. విభిన్నమైన కథలు, కథనాలతో సినిమాలను రూపొందించే దర్శకుడు వి.ఐ.ఆనంద్ మరోసారి ఈ భారీ ప్రాజెక్ట్‌తో క్రియేటివ్ బౌండరీస్ రేంజ్‌ను మరింత పెంచటానికి సిద్ధమయ్యారు. సినీ ప్రేక్షకులకు



ఇప్పటి వరకు చూడని సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను ఇచ్చేలా ఈ క్రేజీ సినిమా రూపొందనుంది.

## బాధ్యతలన్నీ మగాడిపైనే వేయొద్దు..



బ్యూటిఫుల్ రెజీనా భాగస్వామి బాధ్యతల గురించి చెప్పిన మాటలు ప్రస్తుతం సోషల్ డియాలో వైరల్ అవుతున్నాయి. హీరోయిన్‌గా అవకాశాలు అందుకుంటూనే రియాలిటీ డ్యాన్స్ షోకు జడ్జిగా వ్యవహరిస్తున్న ఆమె..రిలేషన్‌లో ఉన్నప్పుడు అమ్మాయి, అబ్బాయి ఎలా నడుచుకోవాలో తన అభిప్రాయాన్ని ఓ ఇంటర్వ్యూలో తెలిపింది. 'నువ్వే అన్నీ చేయాలంటూ అమ్మాయిలు పార్ట్‌నర్ ద ఒత్తిడి పెట్టడం తప్పు. ఇది అన్యాయం.

మెంటల్ హెల్త్ ముఖ్యం. ఒకరి మానసిక ఆరోగ్యం బాగోలేకపోతే, మరొకరు అన్ని బాధ్యతలు ఒక్కడే భరించాలని ఎక్స్‌పెక్ట్ చేయకూడదు. దీన్ని రెండు వైపులా అర్థం చేసుకోవాలి. పార్టనర్ మెజీషియన్ కాదు.

లైఫ్‌లో వాళ్లకి చాలా ఇష్యూస్ ఉంటాయి. వాళ్లకీ వాళ్ల సమస్యలు, ఒత్తిడి, లిమిటేషన్స్ ఉంటాయి. అందుకే రెస్పాన్సిబిలిటీస్ షేర్ చేసుకోవాలి, ఒకరిని ఒకరు సపోర్ట్ చేసుకోవాలి – ఒకరు మాత్రమే అన్నీ భరించాలని అనుకోకూడదు' అని చెప్పుకొచ్చింది. దీంతో ఆమెపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు నెటిజన్లు.


## దేవర – 2పై నిర్మాత బిగ్ అప్‌డేట్..



టాలీవుడ్ లో సింగిల్ టేక్ హీరోగా పేరుతెచ్చుకున్న ఎన్టీఆర్.. ఆర్ఆర్ఆర్ సినిమాతో పాన్ వరల్డ్ హీరోగా ఎదిగారు. 2024లో దేవర సినిమాతో అభిమానులను ప్రేక్షకులను మెప్పించాడు తారక్. ఈ సినిమా క్లైమాక్స్ లో అసలు దేవర ఏమయ్యాడు అన్న సస్పెన్స్ ఉంటుంది. దాంతా సీక్వెల్ ఎప్పుడు ప్రకటిస్తారా అని అభిమానులు వెయిట్ చేస్తున్నారు. తాజాగా.. దేవర–2 పై నిర్మాతల్లో ఒకరైన సుధాకర్ మిక్కిలినేని బిగ్ అప్డేట్ ఇచ్చారు. కొరటాల శివ డైరెక్షన్లో ఈ ఏడాది మే నెల నుంచి దేవర2 సినిమా షూటింగ్ స్టార్ట్ అవుతుందని అనౌన్స్ చేశారు. ఉమ్మడి కృష్ణాజిల్లా నందిగామలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సుధాకర్ ను దేవర–2 ఉంటుందా లేదా అని అక్కడికి వచ్చినవారు అడిగారు. దీంతో దేవర 2 కచ్చితంగా తీస్తామని చెప్పారు. మే నెలలో షూటింగ్ మొదలవుతుందని, 2027లో సినిమాను విడుదల చేస్తామని అభిమానుల ముందు ప్రకటించారు. దీంతో ఎన్టీఆర్ ఫ్యాన్స్ నెట్టింట వరుస పోస్టులు చేస్తున్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ ప్రశాంత్ నీల్ సినిమా చేస్తున్నాడు. ఆ సినిమా తర్వాత దేవర –2 షూటింగ్ కు ఎన్టీఆర్ డేట్స్ ఇచ్చే ఛాన్స్ ఉన్నట్లు తెలుస్తోంది.

అంతా బాగుంటా వచ్చే ఏడాది సంక్రాంతి బరిలో దేవర–2 ఉంటుందని అభిమానులు అంటున్నారు.

## రోడ్డు ప్రమాదంలో తనను కోల్పోయా....



బాలీవుడ్ క్యూట్ హీరోయిన్ అలియా భట్ చిన్నతనంలో తాను అనుభవించిన అత్యంత పెయిన్‌ఫుల్ ఇన్సిడెంట్‌ను గుర్తు చేసుకుంది. విషాదకరమైన రోడ్డు ప్రమాదంలో తన బామ్మను ఏవిధంగా కోల్పోయిందో చెప్పుకొచ్చింది. అప్పటి ఇన్సిడెంట్ గురించి చెప్తూ ఎమోషనల్ అయిన అలియా.. ఈ యాక్సిడెంట్ తమ ఫ్యామిలీపై చాలా ప్రభావం చూపిందని, రోడ్ సేఫ్టీ పట్ల తన అవగాహనను పెంచిందని తెలియజేసింది. అలియాకు 12 ఏళ్ల వయసున్నపుడు ఆమె బామ్మ(నానీ) తన భర్తతో కలిసి గుడికి వెళ్తుండగా ట్రక్ ఢీకొట్టడంతో స్పాట్‌లో చనిపోయినట్లు వెల్లడించింది.

అప్పటి నుంచి తమ ఫ్యామిలీ ఒకలాంటి భయం పెరిగిపోయిందని, ప్రత్యేకించి తన సేఫ్టీ పట్ల తల్లి ఆందోళన చెందేదని చెప్పింది. అయితే అప్పుడు సేఫ్టీ పాటించినా, తాను తల్లి అయిన తర్వాత సేఫ్టీ విషయంలో తన దృక్పథం మారిందని.. తన బిడ్డ కోసమైనా మరింత బాధ్యతగా ఉంటున్నట్లు తెలిపింది.

Edited, Published and Owned by **Ramancharla Srikanth** & Printed by **V. Raj Kumar** at **RK PRINTERS**, # 1-7-210/2, Kamala Nagar, Opp ECIL Bus Stop, ECIL, Hyderabad, Telangana - 500062 & Published from Sri Lakshmi Narsimha Colony, Flat No.106. Balaji Nagar, Kapra, Medchal Dist., Telangana - 500087. **RNI No.: TELTEL/2023/90269**. Editor: **RAMANCHARLA SRIKANTH**, Mob: **9963708331**, Email: telanganashaan331@gmail.com